
సంపుటి :02 సంచిక :165 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

గురువారం 21, ఆగస్టు 2025




కాళేశ్వరం నివేదికపై

## చర్యలు తీసుకుంటారా ?

రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్నలు

02

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు

హాజరైన ఏఐసీసీ పెద్దలు సోనియా, ఖర్గే, రాహుల్



02




## యూరియా కష్టాలు తీవ్రం

- ❖ మానుకోట జిల్లాలో అవే అగచాట్లు
- ❖ గంటలు గంటలు లైన్లలో బారులుతీరుతున్న రైతులు
- ❖ సొమ్మసిల్లి పడిపోతున్న వృద్ధులు

04

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో గురువారం అగ్రోస్ రైతు సేవ కేంద్రంలో యురియా బస్తాలు ఇస్తున్నారని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొని మండలంలో ఉన్న రైతులు ఒక్కసారిగా అక్కడికి చేరుకోవడంతో తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న మరిపెడ ఎస్ఐ సతీష్ కుమార్ గౌడ్, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ వీరా సింగ్ అక్కడికి వచ్చిన రైతులను క్యూలైన్లో వచ్చేలా చర్యలు తీసుకొని ప్రతి రైతుకి ఒక బస్తా చొప్పున వందమంది రైతులకు 100 బస్తాలు పంపిణీ చేశారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. - అక్షరదర్బార్, మరిపెడ



# సర్కార్ ఖజానా నిండేనా ?

02



## మద్యం పాలసీలో కొత్త నిర్ణయాలు

- ❖ క్రితం సారి దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు
- ❖ ఈసారి లక్ష పెంచి రూ.3 లక్షలు ఖరారు
- ❖ ప్రభుత్వానికి వచ్చే ఆదాయంపై సందిగ్ధత

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త మద్యం పాలసీ ద్వారా దరఖాస్తుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని కొందరు, ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు పెంచారు కాబట్టి, కాస్త తగ్గే అవకాశం ఉందని మరొకొందరు చర్చించుకుంటున్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకునే అవకాశం ఉండటంతో.. ఈసారి దరఖాస్తుల సంఖ్య, తద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తోంది.

–అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి



## ప్రదీప్ రావు ప్యానెల్ గెలుపు

ప్రశాంతంగా ముగిసిన వరంగల్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

ఎర్రబెల్లి వర్గీయుల సంబురాలు

04

## మేడారం జాతరను ఘనంగా నిర్వహిస్తాం

- ❖ రేపటి నుంచి పీఆర్ పనుల జాతర
- ❖ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

04





## అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- ❖ రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ❖ తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రూ.5.87 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ❖ ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రతకూ కొత్త రేషన్ కార్డులు అందజేత

04

# 'ఫుడ్ పాయిజన్' పుకార్

- జిల్లా అధికారుల పరుగులు
- కస్తూర్బా స్కూల్లో కలకలం

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొరికిశాల కస్తూర్బా గాంధీ స్కూల్లో 8 మంది పిల్లలకు ఫుడ్ పాయిజన్ అయినట్లు సోషల్ మీడియాలో గురువారం ఒక వార్త వైరల్ కావటంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై కస్తూర్బా గురుకుల పాఠశాలకు పరుగులు పెట్టించింది. అయితే, నలుగురు విద్యార్థులకు జ్వరంతో వాంతులు వచ్చినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కస్తూర్బా స్కూల్లో ఎలాంటి ఫుడ్ పాయిజన్ జరగలేదని, పిల్లలందరికీ వైద్య పరీక్షలు చేశారని డాక్టర్ నాగరాణి చెప్పారు.

# ప్రజలకు అండగా నిలవాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



అక్షరదర్బార్, హనుమకొండ: పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన సుధాకర్, సంపత్ కుమార్, రవీందర్, కిరణ్ కుమార్, శ్రీనివాస్, జె శ్రీనివాస్ , శ్రీనివాస్ రావు, రమేశ్, ప్రభాకర్, కిషన్ రావు, రవీందర్, ప్రభాకర్ , కీర్తి నాగరాజు, నరేందర్ , వెంకటస్వామి గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై పట్టీలను అలంకరించి అభినందనలు తెలియజేసారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు పోలీసుల పట్ల భరోసా, నమ్మకాన్ని కలిగించడంతో పాటు, నిరుపేద ప్రజలకు పోలీస్ అధికారులు అండగా నిలవాలని ఈ సందర్భంగా సూచించారు.



# సర్కార్ ఖజానా నిండేనా?

- మద్యం పాలసీలో కొత్త నిర్ణయాలు
- క్రితం సారి దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు
- ఈసారి లక్ష పెంచి రూ.3 లక్షలు ఖరారు
- ప్రభుత్వానికి వచ్చే ఆదాయంపై సందిగ్ధత



అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త మద్యం పాలసీ ద్వారా దరఖాస్తుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని కొందరు, ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు పెంచారు కాబట్టి, కాస్త తగ్గే అవకాశం ఉందని మరొకొందరు చర్చించుకుంటున్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకునే అవకాశం ఉండటంతో.. ఈసారి దరఖాస్తుల సంఖ్య, తద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తోంది.

### - నోటిఫికేషన్ లోని కీలక అంశాలు..

తెలంగాణలో కొత్త మద్యం దుకాణాల లైసెన్సుల కోసం ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న 2,620 దుకాణాల లైసెన్సులు నవంబర్ 30తో ముగియనుండగా, డిసెంబర్ 1, 2025 నుంచి రెండేళ్ల పాటు కొత్త లైసెన్సులు అమలులోకి వస్తాయి. ఈసారి దరఖాస్తు రుసుమును రూ.3 లక్షలకు పెంచినా, దరఖాస్తుల సంఖ్య తగ్గకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఎందుకంటే, గతంలో మాదిరిగానే ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. గత పాలసీలో రూ.2 లక్షల దరఖాస్తు రుసుముతోనే 1,31,490 దరఖాస్తులు వచ్చాయి. దీని ద్వారా ప్రభుత్వానికి రూ.2,629 కోట్ల ఆదాయం లభించింది. ఈసారి దరఖాస్తు రుసుము రూ.లక్ష పెరిగినందున, దరఖాస్తుదారుల సంఖ్య తగ్గినా, ఒక్కో దరఖాస్తు ద్వారా వచ్చే ఆదాయం పెరిగినందున మొత్తం ఆదాయం పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక వ్యక్తి ఎక్కువ దరఖాస్తులు సమర్పించడం వల్ల ప్రభుత్వ ఆదాయం భారీగా పెరుగుతుంది.

### - కొత్త మద్యం బ్రాండ్లు..

గత పాలసీలో ఏపీ వ్యాపారులు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు సమర్పించగా, ఈసారి ఆంధ్రప్రదేశ్ మద్యం విధానంలో వచ్చిన మార్పుల కారణంగా వారి నుంచి పెద్దగా ఆసక్తి ఉండకపోవచ్చని ఒక అంచనా. అయినప్పటికీ, తెలంగాణ వ్యాపారులు, ముఖ్యంగా కొత్తగా ఈ రంగంలోకి రావాలనుకునే వారు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. కొత్తగా అనుమతులు కోరుతూ వచ్చిన వందలాది మద్యం బ్రాండ్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపితే, మద్యం అమ్మకాల ద్వారా వచ్చే పన్నుల రూపంలోనూ ప్రభుత్వ ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ అంశాలన్నీ పరిగణనలోకి తీసుకుంటే, కొత్త మద్యం విధానం ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తుల రూపంలో మరియు ఇతర మార్గాల ద్వారా గణనీయమైన ఆదాయం లభిస్తుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# కాళేశ్వరం నివేదికపై చర్యలు తీసుకుంటారా ?

## - రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్నలు



అక్షరదర్బార్, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు కుంగుబాటుతో పాటు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంటుందా? లేక అసెంబ్లీలో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటుందా? అని గురువారం తెలంగాణ హైకోర్టు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించింది. ఈ అంశంపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్పష్టం చేయడానికి సమయం కావాలని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోరడంతో, హైకోర్టు విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. కమిషన్ నివేదికను రద్దు చేయాలని పిటిషనర్లు కోరారు. పిటిషనర్ల తరపు న్యాయవాది ఆర్యమ సుందరం వాదనలు వినిపిస్తూ.. నివేదికను కేసీఆర్, హరీశ్‌రావులకు ఇవ్వకుండా, మీడియాకు లీక్ చేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. రాజకీయంగా తమకు నష్టం కలిగించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. దీనిపై అడ్వకేట్ జనరల్ స్పందిస్తూ, నివేదికను మీడియాకు ఇచ్చినా, అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం భావిస్తోందని వివరించారు. ఈ వాదనలు విన్న హైకోర్టు, అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నవారికి నివేదిక ఇవ్వకుండా మీడియాకు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. ప్రభుత్వం చర్యలు తీసుకునే విధానంపై స్పష్టత కోరింది. దీంతో అడ్వకేట్ జనరల్ సమయం అడగడంతో, తదుపరి విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది.

# ఉత్తమ పంచాయతీ కార్యదర్శికి సన్మానం

## గిరిజన అభివృద్ధి సంస్థ చైర్మన్, ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం



అక్షర దర్బార్, కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గంగారం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న బీరెల్లి కరుణాకర్‌ను తోటి మండల పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు గానూ గిరిజన అభివృద్ధి సంస్థ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మల చేతుల మీదుగా కరుణాకర్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

# జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్ దాఖలు

## - హాజరైన ఏఐసీసీ పెద్దలు సోనియా, ఖర్గే, రాహుల్

అక్షరదర్బార్, ఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డి గురువారం ఏఐసీసీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ, చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఈసందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలపై నిబద్ధత, వినయభావంతో నామినేషన్ దాఖలు చేస్తున్నానని అన్నారు. తన జీవితం ప్రజాస్వామ్య సంప్రదాయాలతో ముడిపడి ఉందన్న ఆయన.. ప్రతి వ్యక్తి గౌరవంపైనే భారత్ వాస్తవశక్తి ఆధారపడి ఉందన్నారు. వారి వెంట ఎన్‌సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఎస్పీ నేత రామ్‌గోపాల్ యాదవ్, డీఎంకే తిరుచ్చి శివ, టీఎంసీ నేత శతాబ్ది రాయ్, శివసేన (యూబీటీ) సంజయ్ రౌత్, సీపీఐ(ఎం) జాన్ బ్రిటాస్‌లు ఈ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు 160 మంది ఎంపీలు ఆయనకు మద్దతుగా సంతకాలు చేసినట్లు సమాచారం. నామినేషన్ పత్రాలను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి రశీదును అందజేశారు. మరోవైపు ఎన్డీయే కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ఆగస్టు 20న నామినేషన్ దాఖలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులమీదుగా ఆయన తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించిన విషయం తెలిసిందే.



నామినేషన్ వేస్తున్న సుదర్శన్ రెడ్డి

సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. మొత్తం ఎలక్టోరల్ కాలేజీ సంఖ్య 781 కాగా మెజార్టీ మార్కు 391. అధికార పక్షానికి 422 మంది సభ్యుల మద్దతు ఉంది.

# వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

## దుగ్గొండి ఎస్సై రణధీర్ రెడ్డి వెల్లడి



అక్షర దర్బార్, దుగ్గొండి: వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడానికి పోలీసుల సూచనలను పాటించాలని దుగ్గొండి ఎస్సై రావుల రణధీర్ రెడ్డి బుధవారం సూచించారు. మండపాలను నెలకొల్పేవారు ముందస్తుగా పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద నిర్వాహకుల పేర్లు, ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉండాలని, రాత్రి 10 గంటల తర్వాత మైకులను ఆఫ్ చేసుకోవాలని తెలిపారు. మద్యం సేవించడం, పేకాట, జూదం వంటివి నిషేధమని హెచ్చరించారు.

### ముల్కనూర్ నూతన ఎస్సైగా

# రాజు బాధ్యతలు స్వీకరణ

## శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని వెల్లడి




అక్షర దర్బార్, భీమదేవరపల్లి: ముల్కనూర్ నూతన ఎస్సైగా వి. రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గీసుకొండ ఎస్హెచ్‌ఓగా పనిచేస్తూ ముల్కనూర్‌కు బదిలీపై వచ్చారు. ఆయన స్థానంలో పనిచేసిన నండ్రు సాయిబాబు వర్ధన్నపేటకు బదిలీ అయ్యారు. నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాజు మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అక్రమ వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

# సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

అక్షర దర్బార్, చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ జయశంకర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాధర్నా పోస్టర్‌ను చిట్యాల మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. పెన్షన్ అనేది ప్రభుత్వాలు ఇచ్చే భిక్ష కాదని, అది ఉద్యోగి హక్కని తెలిపారు.










# యూరియా కష్టాలు తీవ్రం

- మానుకోట జిల్లాలో అవే అగచాట్లు
- గంటలు గంటలు లైన్లలో బారులుతీరుతున్న రైతులు
- సొమ్మసిల్లి పడిపోతున్న వృద్ధులు

అక్షరదర్బార్, మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో గురువారం అగ్రోస్ రైతు సేవ కేంద్రంలో యురియా బస్తాలు ఇస్తున్నారని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొని మండలంలో ఉన్న రైతులు ఒక్కసారిగా అక్కడికి చేరుకోవడంతో తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న మరిపెడ ఎస్ఐ సతీష్ కుమార్ గౌడ్, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ వీరా సింగ్ అక్కడికి వచ్చిన రైతులను క్యూలైన్లో వచ్చేలా చర్యలు తీసుకొని ప్రతి రైతుకి ఒక బస్తా చొప్పున వందమంది రైతులకు 100 బస్తాలు పంపిణీ చేశారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు బారులు తీరారు.

### సొమ్మసిల్లి పడ్డ రైతు తలకు గాయం...

నాలుగైదు రోజులుగా ఎంతో మంది రైతులు యూరియా కోసం మరిపెడ మండల కేంద్రానికి వచ్చి ఆగ్రోస్, సొసైటీ వద్దకు వచ్చి పోతున్నారు. అదే క్రమంలో గురువారం అగ్రోస్ దగ్గర యూరియా ఇస్తున్నారనే విషయాన్ని తెలుసుకొని చిల్లంచర్ల గ్రామ పరిధిలో మల్లమ్మ కుంట తండకు చెందిన అజ్మీర లక్క, తన భార్యతో కలిసి వచ్చాడు.
ఇద్దరు వేరువేరుగా ఆగ్రోస్ ఎరువుల విక్రయ కేంద్రం వద్ద క్యూలైన్లో నిలబడ్డారు. ఈ క్రమంలో సొమ్మసిల్లి లక్క కింద పడగా తలకు గాయమై రక్త మోడింది. వెంటనే అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది అందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరము లక్క పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.




# ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండాలి

## డీఎంహెచ్ఓ డా. అప్పయ్య సబ్ సెంటర్ ను సందర్శన

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం కటత్మకూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రమును జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. అప్పయ్య గురువారం సందర్శించారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సబ్ సెంటర్‌కు పలు సూచనలు చేశారు. సబ్ సెంటర్‌లో వైద్య సిబ్బందిని డిప్యూటేషన్ వేసి యుద్ధ ప్రాతిపదికన ఫీవర్ సర్వే చేసి ట్రీట్‌మెంట్ అందించాలని, 'డ్రై డే ఫ్రైడే' నిర్వహించాలని వైద్యధికారిణి, సూపర్వైజర్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపకేంద్రం కాంట్రాక్టర్ దేవేందర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ రాజకుమార్, ఏఎన్ఎం కరుణ, హెల్త్ అసిస్టెంట్ రవీందర్, ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంతిమ యాత్రలో పాల్గొన్న సోదా

## పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు నివాళులు

అక్షర దర్బార్, పరకాల: పరకాల మండలం కామారెడ్డి పల్లె గ్రామానికి చెందిన రాపర్తి ఎర్ర సమ్మయ్య గౌడ్ అనారోగ్యంతో మృతి చెందగా, వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సోదా రామకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామ అధ్యక్షులు పెండెల చంద్రమౌళి, మాజీ సర్పంచ్ భద్రయ్య, చిర్ర రాజయ్య తదితరులు కూడా హాజరయ్యారు.



# కాంగ్రెస్ నాయకుల మొరం దందా


- కాంట్రాక్టు పనులకు తరలింపు
- మాజీ సర్పంచ్ రావుల సరితా రాజిరెడ్డి



అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం రాయపర్తి గ్రామంలో కాంగ్రెస్ నాయకుల మొరం దందా విచ్చలవిడిగా కొనసాగుతుందని మాజీ సర్పంచ్ రావుల సరిత రాజిరెడ్డి విమర్శించారు. గ్రామంలో నిర్మిస్తున్న అంగన్వాడి కేంద్రంలో కాంట్రాక్టర్ చెరువు నుంచి విచ్చలవిడిగా మొరం తరలిస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఈ పనులు జరుగుతున్నాయని సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరకాల ఎమ్మెల్యే స్పందించి సదరు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# బీమా చెక్కు అందజేత

అక్షర దర్బార్, చిట్యాల: ఇటీవల చిట్యాల మండల కేంద్రానికి చెందిన చింతకింది రాజమణి ప్రమాదవశాత్తు మరణించగా, ఆమె కుటుంబానికి గురువారం రూ. 10.20 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ డిఎం వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా పాలసీలు చేసుకోవాలని చెప్పారు.



# బీజేపీ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శికి ఘన సన్మానం

## చిట్యాల మండల కేంద్రంలో సత్కారం

అక్షర దర్బార్, చిట్యాల: బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన అనంతరం చిట్యాల మండల కేంద్రానికి వచ్చిన దొంగల రాజేందర్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బట్టు రవి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంబాల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.






# సీసీఎఫ్ డాక్టర్ బీమా నాయక్ డాక్టరేట్ పట్టా ప్రదానం

## ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పట్టా అందుకున్న సీసీఎఫ్ అధికారి

అక్షర దర్బార్, నర్సంపేట: భద్రాద్రి సర్కిల్ వరంగల్ (సీసీఎఫ్) కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి డాక్టర్ దారావత్ భీమా నాయక్ ఐఎఫ్ఎస్ బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. నర్సంపేట మండలం లాల్ నాయక్ తండాకు చెందిన ఆయన, 1994లో మెకానిక్ ఇంజనీరింగ్, 1996లో ప్రొడక్షన్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. ఐఎస్ఆర్ఓ చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ విద్యావేత్త కుమార్ ములగారం చేతుల మీదుగా ఆయన ఈ పట్టాను అందుకున్నారు. 30 సంవత్సరాల అనంతరం డాక్టరేట్ పూర్తి చేసిన భీమా నాయక్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు అభినందించారు.



# పిచ్చి మొక్కలు, వర్షపు నీరు

**- ఇది ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి**

అక్షరదర్బార్, శాయంపేట: ప్రభుత్వ కార్యాలయాలు ప్రాంగణములో పిచ్చి మొక్కలు, వర్షం నీరుతో ఆపరిశుభ్రతంగా ఉంది. శాయంపేట మండల కేంద్రంలోని తహసిల్దార్, ఎంపీడీవో, ద్వాక్రా, తదితర కార్యాలయాలు ఒకే చోట ఉన్నాయి.ఇక్కడ పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా, వర్షం నీరుతో ఉంది. వర్షం పడితే నీరు నిలిచిపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. స్వచ్ఛ



భారత్ వంటి కార్యక్రమాలు నిర్వహించే ప్రభుత్వ కార్యాలయాల వద్దే ఇలా ఉండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేయాల్సిన అధికారులే పరిశుభ్రతను పాటించక పోవడం ప్రజలు ప్రశ్నిస్తున్నారు.మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు అపరిశుభ్రంగా ఉంటే గ్రామాలలోని ప్రభుత్వ కార్యాలయాలు ఏ విధంగా ఉంటాయో నని ప్రజలు చర్చించుకుంటున్నారు.



# మేడారం జాతరను ఘనంగా నిర్వహిస్తాం

- రేపటి నుంచి పీఆర్ పనుల జాతర
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



అక్షరదర్బార్, హైదరాబాద్: వచ్చే ఏడాది ములుగు జిల్లాలోని మేడారంలో జరుగనున్న సమ్మక్క సారలమ్మ మహా జాతరను ఘనంగా నిర్వహిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. పనుల కోసం ఈ దఫా రూ.150 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జాతరను నిర్వమహిస్తామన్నారు. జంపన్న వాగు నుంచి మేడారం ప్రాంగణం వరకు డబుల్ రోడ్లు, రోడ్ల వెడల్పు, డివైడర్లు, అలాగే 29 ఎకరాల దేవాదాయ శాఖ భూమిలో స్మృతివనం అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. భద్రత కోసం 12 వేల మంది పోలీస్ సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఆదివాసీ పూజారులు కోరిన విధంగా జాతర పనులు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖను పట్టించుకోలేదన్నారు. అనంతరం మంత్రులు పంచాయతీరాజ్ శాఖ రూపొందించిన 'పనుల జాతర 2025 పోస్టర్'ను ఆవిష్కరించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ. "రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా రూ.2,198 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభం కానున్నాయి. వీటిలో ప్రభుత్వ పాఠశాలలలో మరుగుదొడ్లు, మేకల, గొర్రెల షెడ్లు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి పనులు ఉన్నాయి ' అని అన్నారు. పనుల జాతరలో ప్రతి ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు తప్పనిసరిగా పాల్గొనాలని తాను లేఖలు పంపినట్లు తెలిపారు.

# మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత

**బిజెపి మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ పరామర్శ**



అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలోని రామ్ నగర్ కాలనీకి చెందిన పర్లపెల్లి భద్రమ్మ అనారోగ్యంతో గత వారం రోజుల క్రితం మరణించగా, భారతీయ జనతా పార్టీ చిట్యాల మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేసి 50 కేజీల బియ్యాన్ని అందించారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రూ.5.87 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రతకూ కొత్త రేషన్ కార్డులు అందజేత



అక్షరదర్బార్, వరంగల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రూ.5.87 కోట్ల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అందులో జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘ, జనరల్ ఫండ్ నిధులు, ఎస్ఎఫ్ సీ పథకాల కింద రూ.4.87 కోట్ల వ్యయంతో బల్దియా పరిధి 32 వ డివిజన్ బుఆర్ నగర్ లో బస్తి దవాఖాన, ఎన్ ఎన్ నగర్ లో సీసీ రోడ్లు, జ్యోతినగర్ లో సీసీ రోడ్లు, అంబేద్కర్ భవన్ కమ్యూనిటీ హాల్, బీరన్నకుంట కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు, 28వ డివిజన్ బట్టలబజార్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కిచెన్ షెడ్, 42 డివిజన్ రంగశాయిపేటలో నిర్మించనున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పనులకు, ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో రూ.కోటి వ్యయంతో మాషుఖ్ రబ్బానీ దర్గాలో చేపట్టే అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. బీరన్నకుంట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంత్రి, మేయర్, కలెక్టర్, కమిషనర్ మధ్యాహ్నం భోజనం వడ్డించారు. కరీమాబాద్ పరపతి సంఘ భవనంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను మంత్రి కొండా సురేఖ మేయర్, కలెక్టర్, కమిషనర్ లతో కలిసి అందచేశారు. అనంతరం కరీమాబాద్ ఆదర్శ పరపతి సంఘ భవనంలో, రంగషాయిపేట కమ్యూనిటీ హాల్ లో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, కార్పొరేటర్లు, బల్దియా ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



# మృతురాలి జ్ఞాపకార్థంగా బెంచీలు

శాయంపేట అక్షర దర్బార్ : శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన కందగట్ల లక్ష్మీకాంత ఇటీవల అనారోగ్యంతో మరణించగా మృతురాలి జ్ఞాపకార్థంగా వారి మనుమరాండ్లు బెంచీలు పలు ప్రాంతాలలో వేపించడం జరిగినది.మృతురాలు గుర్తింపుగా బెంచీలు వేయించడం వలన పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రదీప్ రావు ప్యానెల్ గెలుపు

- ప్రశాంతంగా ముగిసిన వరంగల్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు
- ఎర్రబెల్లి వర్గీయుల సంబురాలు



అక్షరదర్బార్, వరంగల్ : ఉత్కంఠ రేపిన వరంగల్ అర్బన్ బ్యాంకు ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. ఊహించినట్లుగానే ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్యానెల్ ఈ ఎన్నికల్లో విజయం సాధించింది. వరంగల్ మట్టేవాడలోని ఏవీవీ కళాశాలలో గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన వరంగల్ అర్బన్ బ్యాంకు ఎన్నికల పోలింగ్ మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. ఈ బ్యాంకులో మొత్తం 6,368 మంది ఓటర్లు ఉన్నారు. 12 మంది డైరెక్టర్లను ఎన్నుకోవాల్సి ఉండగా 25 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. జనరల్ విభాగం నుంచి 20 మంది, ఎస్సీ, ఎస్టీ నుంచి ఇద్దరు, మహిళా విభాగంలో ముగ్గురు అభ్యర్థులు పోటీపడ్డారు. ప్రధానంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కోరే చంద్రమౌళి ప్యానల్స్ మధ్య పోటీ జరిగింది. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఓట్ల లెక్కింపు మొదలైంది. కౌంటింగ్ ముగిసిన తర్వాత ఎన్నికల అధికారులు ఫలితాలను ప్రకటించారు. ఎన్నికల్లో గెలుపొందిన ప్రదీప్ రావు సహా 12 మంది విజేతల పేర్లను వెల్లడించారు. ఎర్రబెల్లి ప్రదీప్ రావుతో పాటు ఆయన ప్యానెల్ గెలుపొందింది. వరంగల్ అర్బన్ బ్యాంక్ ఆవిర్భావం నుంచి ఐదు సార్లు బ్యాంకు చైర్మన్ గా పనిచేసిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు వరుసగా ఆరోసారి ఈ ఎన్నికల్లో కూడా విజయం సాధించటం విశేషం. ప్రదీప్ రావు ప్యానల్ విజయం సాధించడంతో ఆయన వర్గీయులు వరంగల్ లో సంబురాలు నిర్వహించారు. వరంగల్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో గెలుపొందిన ప్రదీప్ రావుకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915